క్లుప్తంగా

రేపు ముగ్గుల పోటీలు

బొంరాస్‌పేట: దుద్యాల మండల కేంద్రంలోని నేతాజీ విద్యానికేతన్ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం ఉదయం మండలస్థాయి ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రాఘవేందర్ యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు సమయానికి హాజరుకావాలని కోరారు.

స్వయం ఉపాధితో మహిళలకు గౌరవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంజుల

వికారాబాద్ అర్బన్: నిర్మాణ్ ఫౌండేషన్ సంస్థ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్, కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. మంగళవారం పట్టణంలోని బస్టాండ్ రోడ్డులో నిర్మాణ్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ, కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం ఉపాధితో కుటుంబంలో గౌరవం పెరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, నాయకులు దీపు, సందీప్, నిర్మాణ్ సంస్థ కో ఆర్డినేటర్ రీక్షిత తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఆంజనేయులు

కుల్కచర్ల: యువత, విద్యార్థులు క్రీడల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని బండవెల్కిచర్లలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు క్రీడల్లో రాణించడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాల్లో మంచి ఉపయోగాలు ఉంటాయన్నారు. స్నేహభావం, క్రీడాస్ఫూర్తి పెంపొందుతుందని చెప్పారు. అలాగే, శరీరక దృఢత్వం, ఏకాగ్రత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంజిలయ్య, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, నిర్వాహకులు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు జలీల్, చంద్రయ్య, రాము పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్‌లోని భవానినగర్‌లో వెలసిన అంబాభవాని మాతకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం తాండూరు నియోజకవర్గంలోని భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీ తరలివచ్చారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ పీఠాధిపతి, తెలంగాణ సాధూపరిషత్ అధ్యక్షుడు శ్రీశంకర్ స్వామీజీ ప్రవచనాలు చెప్పారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో ముస్తాబు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

వాల్‌పోస్టర్ విడుదల

అనంతగిరి: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబురాల వాల్ పోస్టర్‌ను స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేతులమీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా నాయకులు రత్నం, అబ్దుల్ కవి, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన కందుల ధర


కందులకు బీట్లు నిర్వహిస్తున్న కమీషన్ ఏజెంట్లు

మర్పల్లి: మండల కేంద్రంలో మార్కెట్ కమీషన్ ఏజెంట్లు నిర్వహించిన ధాన్యం బీట్లలో కందుల ధర స్వల్పంగా పెరిగిందని కమీషన్ ఏజెంట్లు తెలిపారు. మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో ప్రతి మంగళవారం ధాన్యం బస్తాలకు బీట్లు నిర్వహిస్తారు. గత వారం క్వింటాల్ కందులు రూ. 9,000 వేలు పలుకగా, మంగళవారం కందులు మొదటి రకం క్వింటాల్‌కు రూ. 9,590 పలికాయి. రెండవ రకం రూ. 9,100 పలికాయి. వామ క్వింటాల్ మొదటి రకం రూ. 18,000 వేలు పలుకగా, రెండవ రకం రూ. 17,000 పలికిందని కమీషన్ ఏజెంట్లు పేర్కొన్నారు.

పకడ్బందీగా దరఖాస్తుల ఆన్‌లైన్


బొంరాస్‌పేట: ఆన్‌లైన్‌లో విధానాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు

మండల ప్రత్యేకాధికారి గోపాల్

నవాబుపేట: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలని మండల ప్రత్యేకాధికారి గోపాల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన దరఖాస్తులను పరిశీలించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తులు మరోసారి జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలన్నారు. తప్పుఒప్పులను సరి చేసుకుంటూ ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి దరఖాస్తును ఒకటికి రెండుసార్లు పరిశీలించుకున్న తరువాతనే ఆన్‌లైన్ చేయాలన్నారు. ఏ ఒక్క దరఖాస్తుదారుడికి అన్యాయం జరగొద్దన్నారు. మండలంలో 12,184 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటి వరకు 50 శాతం దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జైరాం, ఎంపీడీఓ సుమిత్రమ్మ, సిబ్బంది తదితరులున్నారు.

ముమ్మరంగా ఆన్‌లైన్ నమోదు

బొంరాస్‌పేట: ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్‌లో పొందుపర్చడం ముమ్మరంగా సాగుతోంది. మండంలోని 47 గ్రామపంచాయతీల్లో బొంరాస్‌పేట, దుద్యాల మండలలాల్లో 12,500లకు పైగా దరఖాస్తులు అందాయి. వాటిని పంచాయతీల కార్యదర్శులు అర్జీదారుల నుంచి సంపూర్ణ వివరాలు సేకరించి మండల కార్యాలయానికి పంపుతున్నారు. వాటిని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. టీంలీడర్లుగా తహసీల్దార్లు వెంకటేశ్, తహసీల్దార్ దానయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ రవిలు దరఖాస్తుల స్వీకరించారు.

29 నుంచి పెద్దేముల్‌లో క్రీడాపోటీలు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్

జెడ్పీటీసీ ధారాసింగ్

పెద్దేముల్: ఈ నెల 29 నుంచి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నమని పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 6,7,8, జూనియర్, 9,10 సీనియర్ విద్యార్థులకు క్రీడలతో పాటు అథ్లెటిక్స్ పోటీలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు ఉపాధ్యాయులు ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరయ్యేలా కృషి చేయాలని కోరారు. వారితో పాటు మండల కో–ఆప్షన్ సభ్యుడు నషీర్, నాయకులు ఎల్లారెడ్డి, శోభరాణి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనందచారి తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూమిని కాపాడండి

కుల్కచర్ల: శిఖం భూ మిని కబ్జాదారుల నుంచి కాపాడాలని పీఎస్‌పీఎస్ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఘనపూర్ గ్రామ పరిధి లోని 125 సర్వే నంబర్‌కు చెందిన శిఖం భూమిని కొందరు అక్రమార్కులు కబ్జా చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

రాములోరి అక్షితల పంపిణీ


అక్షితలకు పూజలు చేయిస్తున్న నేతలు

దోమ: అయోధ్యలో ప్రతిష్ఠించే శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా బీజేపీ నేతలు గ్రామాల్లో అక్షితలు పంపిణీ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లిలో అక్షితలను గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ అక్షితలు పంపిణీ చేశారు. ఈ నెల 22న దేశం మొత్తం పండుగ జరుపుకొంటుందని, ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించి పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు బొంగు మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం సెలవు ఇవ్వాలని ధర్నా


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అనంతగిరి: మున్సిపల్ కార్మికులకు ప్రతి మంగళవారం సెలవు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ కోరారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పని విధానం 8గంటలు మాత్రమే కొనసాగించాలన్నారు. పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సబ్బులు, యూనిఫామ్స్ విధిగా ఇవ్వాలని కోరారు. బయోమెట్రిక్ విధానం రద్దుతో పాటు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బుచ్చయ్య, శంకర్, శ్యామలమ్మ, బుచ్చయ్య, శ్యామల్, జంగమ్మ, రాములు, భాస్కర్, రవి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు

- రిటైల్ మార్కెట్‌లో రూ. 8
- తగ్గిన ఉత్పత్తి
- భారీగా పెరిగిన ధర




షాబాద్: నిత్యావసరాల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మొన్నటి వరకు ఉల్లిగడ్డలు, టమోటాల ధరలు ఆకాశాన్నంటగా.. ప్రస్తుతం కోడిగుడ్ల వంతు వచ్చింది. కార్తీక మాసంలో మాంసాహార వినియోగం తక్కువగా ఉండడంతో ధరలు అదుపులో ఉన్నట్లు కనిపించాయి. కార్తీక మాసం ముగియడంతోనే కోడిగుడ్లకు రెక్కలొచ్చాయి. గత నెలలో ఒక్కో గుడ్డు ధర రూ.5.50 ఉండగా.. వారం క్రితం రూ.6కు చేరింది. డజన్ గుడ్ల ధర వారం రోజుల్లో రూ.72 నుంచి రూ.84కు చేరింది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో ఒక గుడ్డు రూ.8కు అమ్ముతున్నారు. చలి తీవ్రత పెరగడం, ఉత్పత్తి తగ్గడంతో కోడిగుడ్ల ధర పెరుగుతోందని భావిస్తున్నారు. అలాగే చికెన్ ధర కూడా పెరుగుతోంది. గత నెలలో కిలో చికెన్ ధర రూ.160 నుంచి రూ.190లోపు ఉంది. ప్రస్తుతం చికెన్ ధర రూ.250కి చేరింది. రానున్న రోజుల్లో చికెన్ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు చెబుతున్నారు. ధరలు పెరుగుతుండడంతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు.

14, 15వ తేదీల్లో వాలీబాల్ టోర్నమెంట్

కుల్కచర్ల: ఈ నెల 14,15వ తేదీల్లో ఇప్పాయిపల్లిలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పాయిపల్లి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పో టీలు జరగనున్నాయి. టోర్నీలో గెలుపొందిన వా రికి ప్రథమ బహుమతికి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ. 10వేలు ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు రాంజీ, రాంచంద్రయ్య, వెంకట్‌రెడ్డి, యాదయ్య, ఆనంద్, రాంచంద్రయ్య, రాములు పేర్కొన్నారు. ఉత్సాహం గల క్రీడాకారులు టోర్నీలో పాల్గొనేందుకు 767588781, 9441726991 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో ఉండి సేవలందిస్తాం

ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి


ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దోమ మండల పరిధిలోని బాస్పల్లి గ్రామానికి చెందిన చిన్న నర్సయ్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో మంగళవారం ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి రూ. 1లక్ష ఎల్‌ఓసీని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతయ్య, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ప్రజలకు ఆధ్యాత్మికత గురించి వివరించి వారిలో మార్పులను తీసుకువస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఓంశాంతి సెంటర్ ఇన్‌చార్జి పద్మ, జయరాం, సునిత తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం


ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

యాలాల: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జక్కేపల్లికి చెందిన రాంచంద్రప్ప కుమారుడు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో వైద్య చికిత్సల నిమిత్తం రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడికి అందజేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు మెరుగైన చికిత్స అందించేందుకు ఆరోగ్య శ్రీ సేవలను మరింత పెంచామన్నారు. ఆయన వెంట యాలాల సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఏర్పుమళ్లకు చెందిన యువకుడు హరీష్‌గౌడ్‌కు ఈ నెల 3న రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, నియోజకవర్గం ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి తెలపడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.3లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచు ఎల్లప్పగౌడ్ ఉన్నారు.

నిరుపేదలకు అండగా కాంగ్రెస్

పెద్దేముల్: పేదలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పెద్దేముల్ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ అన్నారు.పెద్దేముల్ గ్రామానికి చెందిన మహ్మద్ అలీ ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో రూ.7లక్షల ఎల్‌ఓసీని మంగళవారం పెద్దేముల్‌లో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, జిల్లా మహిళ అధ్యక్షురాలు శోభరాణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, తాండూరు వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్‌లు బాధిత కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు డాక్టర్ రమేష్‌కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీణ్‌కుమార్‌తో పాటు నర్సిములు, షబీర్, రవిశంకర్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న చలాన్ల గడువు

సీఐ అంజనేయులు



మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం వాహనాలపై ఉన్న చలాన్ల చెల్లింపులపై ఇచ్చిన డిస్కౌంట్ ఆఫర్ బుధవారంతో ముగియనుందని మోమిన్‌పేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ అంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వాహనాలపై ఉన్న చలాన్లు వెంటనే చెల్లించాలని కోరారు. దగ్గరలో ఉన్న మీ సేవ, పేటీఎం, గూగులేపే, ఫోన్‌పే, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చని సూచించారు. వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వరకు చలాన్లు చెల్లించుకొనే అవకాశం ఉందన్నారు.

పెండింగ్ చలాన్లు చెల్లించాలి

నవాబుపేట: మండలంలోని వాహనదారులు పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని నవాబుపేట ఎస్ఐ భరత్‌భూషన్ పేర్కొన్నారు. మండలంలో అన్ని వాహనాలకు కలిపి రూ.5వేల వరకు పెండింగ్ చలాన్లు ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయితీతో చలాన్లు చెల్లించుకునే అవకాశం బుధవారంతో ముగియనున్నట్లు తెలిపారు. కావునా, మీసేవా పేటీఎం, హెచ్‌డీఎఫ్‌సీ, ఆన్‌లైన్ లింకుల ద్వారా పెండింగ్ చలాన్లను చెల్లించుకోవాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి


కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

బీజేపీ సీనియర్ నాయకుడు లక్ష్మణ్

మర్పల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మండల బీజేపీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని పట్లూర్, మల్లికార్జున గిరి గ్రామాల్లో పట్లూర్ ఎస్‌బీహెచ్ బ్రాంచ్ మేనేజర్ నర్సింహ్మ ఆధ్వర్యంలో వికాస్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బ్యాంకు మేనేజర్ నర్సింహ్మ, ఆయా శాఖల అధికారులు చెప్పిన విధంగా అర్హులైన వారు మీసేవా లేదా పోస్టాఫీసుల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అనంతరం వికాస్ భారత్ సంకల్ప యాత్ర రథంపై ఏర్పాటు చేసిన టీవీలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్, మహిపాల్‌రెడ్డి, జైపాల్, మధు ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సత్కారానికి జిల్లా కళాకారులు


మామిడి హరికృష్ణతో జిల్లా కార్యదర్శి కృష్ణయ్య

బొంరాస్‌పేట: రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించిన ఆత్మీయ సత్కార మహోత్సవానికి జిల్లా నుంచి జానపద కళాకారులు తరలివెళ్లినట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణయ్య తెలిపారు. జిల్లా నుంచి జుంటిపల్లి తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శన ఇచ్చారని చెప్పారు. సారిపల్లి కొండల్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ మంత్రి కృష్ణారావు, మంత్రి ప్రభాకర్‌లను సన్మానించామన్నారు. సంఘం తరఫున చేసిన కళాకారుల డిమాండ్‌లకు మంత్రులు సానుకూలంగా స్పందించారని తెలి పా రు. సాంస్కృతిక శాఖ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి హరికృష్ణతో పాటు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి సుంచులింగయ్య, సునిత ఉన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎస్ఐ కాశీనాథ్


మాట్లాడుతున్న ఎస్ఐ కాశీనాథ్

పెద్దేముల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పెద్దేముల్ ఎస్ఐ కాశీనాథ్ సూచించారు. సోమవారం రాత్రి పెద్దేముల్ మండలం రెగోండి గ్రామంలో జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కళాబృందంచే వివిధ సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు, చిన్న పిల్లలకు వాహనాలు ఇవొద్దని , బాల్య వివాహలు చేయొద్దని, ఆన్‌లైన్ ద్వారా మోసాలు, మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100 మొదలగు వాటిపై పాటలు, నాటికలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హైదర్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించండి


ఉపాధ్యాయులతో చిన్నారులు

బొంరాస్‌పేట: పలక పట్టి రాయాల్సిన చేతులు.. మట్టి పిసికి ఇటుకలు చేస్తుంటే చూసి చలించిన సీఆర్‌పీ 'బాబూ.. బడికి రండి..!' అంటూ బడి బయట పిల్లల్ని బడిలో చేర్పించారు. వారి బతుకులు మార్చడానికి ఇటుక బట్టీల నుంచి దూరం చేసి బడిబాట పట్టించారు. మండలంలోని సీఆర్‌పీ సోమ్లానాయక్ నేతృత్వంలో బుర్రితండా, తుంకిమెట్ల గ్రామాల్లో బడిబయటి పిల్లలను సర్వే చేసి గుర్తించారు. బుర్రితండా సమీపంలోని జాతీయ రహదారి 163 పక్కన ఉన్న ఇటుక బట్టీలో పలు కుటుంబాలు పని చేస్తున్నాయి. వారి తల్లిదండ్రులతో మాట్లాడి భోజన్నగడ్డ తండాల ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కోదరే ఉమా (ఒకటో తరగతి), కోదరే మాధవ్ (మూడో తరగతి), బేబీ(ఒకటో తరగతి)లో చేర్చారు. హెచ్‌ఎం వెంకటేశ్, ఐఈఆర్పీ టీచర్ వేణుగోపాల్ ఉన్నారు.

దుకాణం దగ్ధం


దగ్ధమవుతున్న దుకాణం

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ఓ దుకాణంలో సోమవారం రాత్రి మంటలు చెలరేగి సామగ్రి దగ్ధమైంది. పట్టణంలోని రైల్వేగేటు సమీపంలో ఫైజల్ అనే వ్యక్తి ఇంట్లో ఉపయోగించుకునే చిరు సామగ్రిని విక్రయిస్తుంటాడు. సోమవారం అర్ధరాత్రి అకస్మాతుగా దుకాణంలో నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. రూ. లక్షకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు ఫైజల్ వాపోయాడు. ఈ మేరకు పలువురు అనుమానితులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

పశువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పశు సంవర్ధకశాఖ రిటైర్డ్ అధికారి పున్నయ్య


హరిదాస్‌పల్లిలో మేకలకు నట్ట మందుతాగిస్తున్న డాక్టర్ బసవపున్నయ్య

ధారూరు: పశువుల పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశు సంవర్ధక శాఖ రిటైర్డ్ అధికారి డాక్టర్ బసవపున్నయ్య అన్నారు. మండలంలోని హరిదాస్‌పల్లి, నర్సాపూర్ గ్రామాల్లో కేరెళ్లి సత్య సాయి సేవా సమితి, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సంయుక్తంగా నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం అందించే పశువుల పునరుత్పత్తి కార్యక్రమాలను సకాలంలో ఉపయోగించుకుని పాల దిగుబడిని పెంచుకోవాలని రైతులకు సూచించారు. పశువులకు ఉచితంగా చికిత్సలు అందించడంలో గ్రామీణ రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న గాలికుంటు టీకాలు ప్రతి 6 నెలలకు ఒకసారి తీసుకుంటే పశువులకు సోకే పేలు, గోమార్లు వ్యాపించకుండా ఆరోగ్యంగా ఉంటాయన్నారు.